క్లుప్తంగా

నారసింహ అవతారంలో జగన్నాథుడు



మాడుగుల: జగన్నాథ రథయాత్రలో భాగంగా శుక్రవారం జగన్నాథుడు నారసింహ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

6ఏ కేసులో పట్టుబడిన బియ్యం వేలం 30న

రావికమతం: మండలంలోని పలు 6ఏ కేసుల్లో పట్టుబడిన 18 క్వింటాళ్ల బియ్యాన్ని ఈ నెల 30 వేలం వేయనున్నట్టు తహసీల్దార్ మహేశ్వర రావు శుక్రవారం తెలిపారు. ఇప్పటికే తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో సమాచారాన్ని అందుబాటులో ఉంచామన్నారు. వివరాలకు పౌరసరఫరాల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ 63023 09508కు సంప్రదించాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న సూపర్‌వైజర్

రోలుగుంట: గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఇవ్వాలని రోలుగుంట సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.హేమావతి కార్యకర్తలను ఆదేశించారు. రావికమతం ప్రాజెక్ట్ నుంచి ఇటీవల బదిలీపై వచ్చినామె తొలిసారిగా శుక్రవారం మండలంలోని కొమరవోలు, కొండపాలెం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. దీనిలో భాగంగా కేంద్ర నిర్వహణకు సంబంధించిన గుడ్డు, వంట సరకులకు సంబంధించిన నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు. వచ్చిన చిన్నారులను హాజరుతో సరిపోల్చారు. కొండపాలెం కేంద్రం-2లో ఈమె సందర్శన సమయంలో బాలింతలు, గర్భిణులు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న విధంగానే పోషకాహారం అందించాలని కార్యకర్తను ఆదేశించారు. మహిళా సంరక్షణ కార్యదర్శి కె.నూకరత్నం పాల్గొన్నారు.

ఆరిల్లోవ రోడ్డు పనుల ప్రారంభంపై హర్షం



రోడ్డు పనుల వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న నాయకులు

గొలుగొండ: ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో రోడ్డు పనులు ప్రారంభంపై వైఎస్సార్‌సీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ సుర్ల గిరబాబు, పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం అక్కడ వైఎస్సార్‌సీపీ జెండాలతో సంబరాలు చేశారు. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కృషి తోనే రోడ్డు మంజూరైందన్నారు. ఈ పనులు చేస్తున్న ప్రాంతంలో వచ్చిన ప్రయాణికులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఎస్సీ సెల్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత, వైస్ ఎంపీపీ సుర్ల బాజ్జి, పార్టీ యూత్ మండలాధ్యక్షుడు రామకృష్ణనాయుడు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం ఛిన్నాభిన్నం



అవగాహన కల్పిస్తున్న సీఐ గణేష్

నర్సీపట్నం: గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని పట్టణ సీఐ ఎన్.గణేష్ సూచించారు. శుక్రవారం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మత్తు పదార్థాల దుష్ఫలితాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలు మానవ జీవన శైలిని ఛిన్నాభిన్నం చేస్తాయన్నారు. చాలా మంది వీటికి బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని వాపోయారు. వారి కుటుంబాలు సైతం వీధిన పడుతున్నాయన్నారు. ప్రభుత్వం వీటిని నిరోధించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. ఎస్సై గోవిందరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన సీఎం జగన్‌కే సాధ్యం

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- కొండయ్యపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



కొండయ్యపాలెంలో మహిళలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్: ఎన్నికల హామీలు ఇవ్వడమే కాదు.. వాటిని నెరవేర్చి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమని నిరూపించారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శుక్రవారం సాయంత్రం పోతనపూడి పంచాయతీ శివారు కొండయ్యపాలెంలో ఆయన ఇంటింటికీ తిరిగి సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరించారు. ప్రతి మహిళను ఆప్యాయంగా పలకరించి సంక్షేమ లబ్ధి బుక్‌లెట్లు అందించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ 20 సంక్షేమ పథకాలు ద్వారా గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజలకు 9 కోట్ల 35 లక్షల 52 వేల 026 రూపాయల లబ్ధి చేకూరిందన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపడతామన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికిగాను జలజీవన్ మిషన్ ద్వారా రూ.93 లక్షలతో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు మంజూరు చేస్తామని, పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, ఎంపీడీవో మీనాకుమారి, ఐసీడీఎస్ పీవో శ్రీదేవి, వైస్ ఎంపీపీలు తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, కొత్తపల్లి శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు రమణమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు కోరుకొండ చెల్లంనాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కోరుకొండ వెంకట వరలక్ష్మి, పార్టీ నాయకులు కోరుకొండ సత్తిబాబు, సోషల్ మీడియా కన్వీనర్ ఇల్లగంతులు మహాలక్ష్మీనాయుడు, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, సహకార సంఘం అధ్యక్షుడు గొల్లవిల్లి రాజేశ్, ఎం. కోడూరు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, పార్టీ నాయకులు పడాల అప్పలనాయుడు, దాడి రాజేశ్వరరావు, కోన శ్రీను, వెలగాడ ఈశ్వరరావు, మండల ఇంజినీరింగ్ అధికారులు శ్రీనివాసరావు, లెక్కల సత్యనారాయణ, నర్సింగరావు, భార్గవ్‌కుమార్, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు ముకుందపురంలో గడప గడపకు

ముకుందపురంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, సర్పంచ్ కర్రి గణేశ్ శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరవుతారని, పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొనాలని కోరారు.

పైసా ఖర్చు లేకుండా మాబిడ్డకు గుండె శస్త్రచికిత్స

- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ వద్ద చిన్నారి తల్లిదండ్రుల భావోద్వేగం
- 'గడపగడపకు' అపూర్వ ఆదరణ



ఎమ్మెల్యే గణేష్ నుంచి బుక్‌లెట్ అందుకుంటున్న చిన్నారి తల్లి

నర్సీపట్నం: 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయవల్ల వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో మా బిడ్డ ఓంకార్ ఈశ్వర్(2)కు పైసా ఖర్చు లేకుండా రూ.5 లక్షలతో ఓపెన్ హార్ట్ సర్జరీ చేశారు. రైతు కుటుంబానికి చెందిన మాకు ఆర్థిక భారం తొలగించారు.' అని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ వద్ద బాలుడు కుటుంబ సభ్యులు భావోద్వేగానికి లోనయ్యారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కృష్ణాపురం వెళ్లిన ఆయనపై పూలవర్షం కురిపించి హారతులు పట్టి స్వాగతం పలికారు. ఇందులో భాగంగా మున్సిపాలిటీ 20వ వార్డు క్లోంపూడి, సీతయ్యపాలెం, కృష్ణాపురంలో ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ మున్సిపాలిటీ శివారు గ్రామాలను గతంలో పాలకులు సందర్శించిన దాఖలాలు లేవు. ఎన్నికల ముందు గ్రామాలను సందర్శించడంతో పాటు ఇప్పుడు ఎమ్మెల్యే హోదాలో రావడంతో ఆనందం వ్యక్తం చేశారు. వర్షంలోనూ ప్రతి ఇంటికి వెళ్లి నాలుగేళ్ల కాలంలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలను అర్హులైన వారందరికీ అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. అర్హతే ప్రామాణికంగా తీసుకుని రాజకీయాలకు అతీతంగా ప్రజలకు లబ్ధి చేకూర్చుతున్నామన్నారు. శిథిలమైన రోడ్డు స్థానంలో కొత్త రోడ్డు నిర్మించాలని క్లోంపూడి గ్రామస్తులు కోరారు. రోడ్డు ఎస్టిమేషన్ తయారు చేయాలని మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. సీతయ్యపాలెంలో ప్రధాన రహదారి ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణానికి ఎస్టిమేషన్ వేయాలన్నారు. కృష్ణాపురంలో బస్సు షెల్టర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. గడపగడపకు వచ్చిన సమస్యలను జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. గడప గడపకు వచ్చిన సమస్యలు మరలా తన దృష్టికి రాకుండా బాధ్యతయుతంగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, కౌన్సిలర్ బయపురెడ్డి చినబాబు, వార్డు ఇన్‌చార్జి ఈశ్వరరావు, పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఉన్నీషాబేగం, కర్రి శ్రీనివాసరావు, అర్జున్ వెంకట్రావు, మహిళా విభాగం అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, సచివాలయ కన్వీనర్ తమరాన శ్రీనువాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'మోడల్'లో ప్రవేశానికి దరఖాస్తులు

నర్సీపట్నం: వేములపూడి ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సంధ్యారాణి తెలిపారు. 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్లును రిజర్వేషన్ ప్రాతిపదికన భర్తీ చేస్తున్నామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు స్కూల్‌లో సంప్రదించాలన్నారు.

మిగులు సీట్లు భర్తీకి 26న ప్రవేశ పరీక్ష

చీడికాడ: మంచాల మోడల్ స్కూల్‌లో 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్లు భర్తీకి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కె.వెంకటలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఈ నెల 26న ఉదయం 9 గంటలకు మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తామన్నారు.

పడాలపాలెంలో రూ.2లక్షలతో తాగునీటి బోర్లు



లగుడు కొత్తూరులో భూమిపూజ చేసి రిగ్గు పనులు ప్రారంభించిన సర్పంచ్ సత్యవతి దంపతులు

రోలుగుంట: పడాలపాలెం గ్రామ పంచాయతీకి రెండు తాగునీటి బోర్లు ఏర్పాటు కోసం సర్పంచ్ పాచిల సత్యవతి అభ్యర్థన మేరకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదేశాలతో జెడ్పీటీసీ పోతల లక్ష్మీ రమణమ్మ తన నిధుల నుంచి రూ.2 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో గ్రామ శ్మశానవాటికలో ఒకటి, లగుడు కొత్తూరులోని అడవిరాజులబాబు గుడి సమీపంలో మరొకటి ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు సర్పంచ్ సత్యవతి, రామకృష్ణ దంపతులు శుక్రవారం భూమిపూజ చేసి రిగ్గు పనులు ప్రారంభించారు. ప్రభుత్వ విప్ ధర్మశ్రీకి, జెడ్పీటీసీ లక్ష్మీ రమణమ్మకు సర్పంచ్ దంపతులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ సత్యనారాయణ

మాకవరపాలెం: విద్యా ప్రమాణాల మెరుగుకు ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం అన్ని పాఠశాలల ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి అమలు చేస్తున్న పథకాలు విద్యార్థులకు సక్రమంగా అందడంతోపాటు వెనుకబడి ఉండే వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నాడు-నేడు పనులతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని, విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు శ్రమించాలన్నారు. మండలానికి మరింత గుర్తింపు తీసుకువచ్చేలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుణశ్రీ, ఎంఈవోలు నరేష్, మూర్తి పాల్గొన్నారు.

శివారు గ్రామాలను అభివృద్ధి చేస్తాం



బోరు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

నాతవరం: ఎం.బెన్నవరం పంచాయతీ శివారు గ్రామాలను సైతం అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి అవసరమైన నిధులు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మంజూరు చేస్తున్నారని ఎంపీటీసీ సభ్యుడు తమరాన లోవకృష్ణ, సర్పంచ్ మార్తి నాగమణి తెలిపారు. ములగపూడిలోని శ్మశానవాటికలో శుక్రవారం వారు చేతిపంపు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించి సుస్థిరమైన స్థానాన్ని పొందారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఇట్టంశెట్టి గోవిందరావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తమరాన రాము, కార్యకర్తలు గొడితి సాయిబాబా, లోకావరపు సత్తిబాబు (బంగారం) పంచాయతీ కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

నామమాత్రపు రుసుంతో పశు బీమా



దేవరాపల్లిలో మేకలకు నట్టల నివారణ మందు తాపిస్తున్న పశువైద్యాధికారి అలేఖ్య

దేవరాపల్లి: వైఎస్సార్ పశు బీమా పథకాన్ని పాడి రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని దేవరాపల్లి పశు వైద్యాధికారి ఎస్. అలేఖ్య అన్నారు. దేవరాపల్లి, రైవాడ గ్రామాల్లో వైఎస్సార్ పశు బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశు పోషణపై ఆధారపడిన పశు పోషకులను ఆపత్కాలంలో ఆదుకుంటుందన్నారు. పశువైద్యులు లేదా సచివాలయాల్లో పశు బీమా చేయించుకోవాలన్నారు. అనారోగ్యం, ప్రకృతి విపత్తు, రోడ్డు ప్రమాదాల్లో మరణించే పశువులకు బీమా వర్తిస్తుందన్నారు. నామమాత్రపు రుసుం చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఈ సందర్భంగా గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపించారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: ప్రకృతి వ్యవసాయంలో జీవామృతం తయారు చేసి తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా ప్రకృతి వ్యవసాయం రైతు సాధికార సంస్థ ప్రాంతీయ సమన్వయకర్తలు కె. ప్రకాష్, హేమసుందర్ తెలిపారు. శుక్రవారం వీరనారాయణంలో రైతులతో సామూహిక ఘన జీవామృతం తయారు చేయించారు. వరి విత్తనాలు, విత్తన గుళికలు తయారు చేశారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి వారు మాట్లాడుతూ 30 రకాల విత్తనాలు భూమిలో వేయడం వల్ల అన్ని రకాల పోషకాలు అందుతాయని, సూక్ష్మజీవులు పెరుగుతాయని, భూమి గుల్లబారుతుందన్నారు. 12 కిలోల విత్తనాలు వెయ్యడం వల్ల 10 టన్నుల ఎరువు భూమికి అందుతుందన్నారు. మంచి దిగుబడి ఆరోగ్యకరమైన పంట పండించవచ్చునన్నారు. అనకాపల్లి జిల్లా అదనపు డీపీఎం ఆర్.వి.స్వామినాయుడు జీవామృతం తయారు గురించి వివరించారు. ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రకృతి వ్యవసాయ రైతు సాధికారిత సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష

- ఎంపీడీవో హనుమంతరావు



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో హనుమంతరావు

నాతవరం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా పని చేసి విజయవంతం చేయాలని ఎంపీడీవో హనుమంతరావు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులకు అవగాహన కల్పించారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధుల సహకారంతో నిబంధనల ప్రకారం పని చేస్తే ఆశయం నెరవేరుతుందన్నారు. ప్రజలకు ప్రభుత్వం ఆశించిన విధంగా నిర్దేశించిన పనులు చేయగలుగుతామన్నారు. వచ్చే నెల ఒకటి నుంచి ఇంటింటికీ వెళ్లి 11 రకాల సేవలందించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడు, డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, వైస్ ఎంపీపీ పైల సునీల్, నాతవరం ఎంపీటీసీ సభ్యురాలు కరక రేణుక, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయండి
దేవరాపల్లి ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి



మాట్లాడుతున్న ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం

దేవరాపల్లి: అర్హులందరికీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి కోరారు. ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి అధ్యక్షతన స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశం మందిరంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలపై ఆరా తీసి పరిష్కరించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం చరిత్రాత్మకమన్నారు. శనివారం నుంచి జరిగే గృహ సందర్శనలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందితోపాటుగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొని కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి గ్రామ సచివాలయాల్లోని క్యాంప్‌లో సైతం అధికారులతో కూడిన బృందాలతో పాల్గొని పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, సర్పంచ్‌లు చింతల సత్య వెంకటరమణ, కర్రి సూరినాయుడు, రొంగలి వెంకటరావు, దాడి జగన్, ఎంపీటీసీలు రొంగలి నారాయణమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వడ్డాదిలో సమస్యలు పరిష్కరిస్తా

'గడపగడపకు' కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



వడ్డాదిలో ప్రజా సమస్యలు వింటున్న విప్ ధర్మశ్రీ



మహిళల బ్యాంక్ రుణాల మంజూరుపై ఐవోబీ మేనేజర్‌తో ఫోన్లో మాట్లాడుతున్న ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: వడ్డాది మేజర్ పంచాయతీలో ప్రజా సమస్యలు లేకుండా పరిష్కరిస్తానని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ హామీ ఇచ్చారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన వడ్డాదిలోని రెల్లివీధి, కుమ్మరవీధి, షరాబుల కాలనీ, పాత కోఆపరేటివ్ కాలనీ, మెయిన్ రోడ్డులో మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్ల పాలనా కాలంలో అందించిన సంక్షేమ లబ్ధిని వివరించారు. ఈ క్రమంలో వీధివీధినా వైఎస్సార్ ప్రభుత్వ పాలన బాగుందని, ముఖ్యంగా జిల్లా, మండల స్థాయిలో ప్రభుత్వ సేవలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాల ద్వారా గ్రామంలోకి తీసుకొచ్చి మేలు చేశారని పలువురు ఆనందం వ్యక్తం చేశారు. స్వగ్రామంలోనే అన్ని రకాల సేవలతోపాటు రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు లభిస్తున్నాయని, పండించిన పంటలను ఇక్కడే అమ్ముకునే సౌకర్యం కల్పించాలని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంచినీటి సమస్యతోపాటు పలు వీధుల్లో కమ్యూనిటీ హాళ్లు ఏర్పాటు చేయాలని విప్ ధర్మశ్రీని కోరారు. ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ప్రణాళికలు తయారు చేయాలని మండల ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఈ క్రమంలో మహిళలు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ సిబ్బంది సకాలంలో డ్వాక్రా రుణాలు ఇవ్వడం లేదని మొరపెట్టుకున్నారు. వెంటనే విప్ ధర్మశ్రీ స్పందించి అక్కడికక్కడే ఐవోబీ మేనేజర్‌కు ఫోన్ చేసి రుణాలందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, మాజీ వైస్ ఎంపీపీ దాడి సూరినాగేశ్వరరావు, కోఆపరేటివ్ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు, సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మి సూరి అప్పారావు, ఎంపీటీసీ ఇంటి అప్పారావు, కోరుకొండ రమణ, నాయకులు కుబిరెడ్డి వెంకటరావు, పాలిమేర కృష్ణ, వీర్ల సురేష్, గుమ్మిడి ప్రసాద్, శంకర్రావు, బేతి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

పార్టీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు



మండలాధ్యక్షుడు నాగేశ్వరరావును సత్కరిస్తున్న సీనియర్ నేత చిట్టిబ్బాయ్, ఎంపీటీసీ రమణ

నాతవరం: మండలంలో వైఎస్సార్‌సీపీని మరింతగా బలోపేతం చేయడమే ధ్యేయంగా పని చేస్తానని పార్టీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు తెలిపారు. ఆయన్ను శుక్రవారం గునుపూడిలో సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ పోలుపర్తి చిట్టిబ్బాయ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి పనులు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ముందుగా మన మండలంలోనే పూర్తి చేశారన్నారు. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురైనా ప్రజల కోసం పార్టీ కోసం నిత్యం పని చేస్తున్నారన్నారు. సామాన్య కార్యకర్త సైతం ఏ నాయకుడు ప్రమేయం లేకుండా నేరుగా ఎమ్మెల్యే వద్దకు వెళ్లి పని చేయించుకునే అవకాశం ఉందన్నారు. వీటిన్నింటిని దృష్టిలో పెట్టుకుని వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయంతోపాటు ఎమ్మెల్యేను గెలిపించుకునేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పోలుపర్తి వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వేముల సూరిబాబు, ఏఎంసీ డైరెక్టరు అడిగర్ల నాయుడు, పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పరదేశి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన బోధనకు కృషి

- ఉపాధ్యాయ సంఘ నాయకులకు ఎంఈవో-2 జగ్గారావు సూచన



ఎంఈవో-2 జగ్గారావును సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

రోలుగుంట: విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు అందరమూ సమష్టిగా కృషి చేద్దామని ఉపాధ్యాయ సంఘాల నాయకులకు ఎంఈవో-2 పి.జగ్గారావు సూచించారు. ఏపీటీఎఫ్, ఎస్టీయూ నాయకులు శుక్రవారం మధ్యాహ్నం ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ అధ్యక్షుడు పి.రమణ, గౌరవాధ్యక్షుడు ఎం.దేముడుబాబు, యూనియన్ సీనియర్ నాయకులు ఆర్.వి.ఎస్.ఆర్.శర్మ, బొనెల రాము, రాంబాబు, ఎస్టీయూ అధ్యక్షుడు ప్రభాకరరావు మాట్లాడుతూ యూపీ స్కూళ్ల విలీనం, ఇందులో తలెత్తిన సమస్యలను పరిష్కరించాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం రోజు నుంచే జగనన్న విద్యా కానుక కిట్లు ఇవ్వడంతో ఆనందం వ్యక్తం చేశారు. దీనిపై ఎంఈవో-2 మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలు, సౌకర్యాల గురించి విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు వివరించి పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలన్నారు.

ఎంఈవోలకు ఘన సత్కారం



సాయిశైలజను సత్కరిస్తున్న పీఆర్టీయూ యూనిట్ సభ్యులు

మాకవరపాలెం: పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఎంఈవోలకు ఘన సత్కారం చేశారు. గతంలో ఇక్కడ పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఎంఈవో సాయిశైలజతో పాటు నూతనంగా మాకవరపాలెం మండలానికి నియమితులైన ఎంఈవోలు నరేష్, పి.ఎస్.ఎన్. మూర్తిలను శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నేత పెట్ల భద్రాచలం, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు కె.త్రిమూర్తులు, కార్యదర్శి కోసూరు రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎంఈవో నాగేంద్రను సత్కరిస్తున్న పీఆర్టీయూ నాయకులు

నర్సీపట్నం: నూతన ఎంఈవో నాగేంద్రను, బదిలీపై వెళ్లిన ఎంఈవో సాయిశైలజను పీఆర్టీయూ నాయకులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. అందరి సహకారంతో ఆరేళ్ల పాటు ఎంఈవోగా విధులు నిర్వర్తించడం సంతోషంగా ఉందని ఆమె తెలిపారు. అందరి సహకారంతో మండలాన్ని ముందంజలో ఉంచేందుకు కృషి చేస్తానని నూతన ఎంఈవో అన్నారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపినాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెదుళ్లవలస వీఆర్‌ఏపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

రోలుగుంట: కొవ్వూరు పంచాయతీ వెదుళ్లవలస గ్రామ రెవెన్యూ సహాయకురాలు శీరందాసు ప్రభావతి అందుబాటులో ఉండడం లేదని తహసీల్దార్ వరహాలుకు శుక్రవారం వేర్వేరుగా ఫిర్యాదలందాయి. గ్రామస్తులకు అందుబాటులో ఉండడం లేదని, భూసమస్యలు, రెవెన్యూ శాఖకు సంబంధించిన పనులకు ఏ విధమైన సమాచారం ఇవ్వక ఇబ్బందులు పడుతున్నట్టు వారు వాపోయారు. ఆమెతో తాము వివాదానికి దిగలేమని, అందుబాటులో ఉంటూ అవసరమైన సేవలందించాలని కోరారు. పండూరి మాధవరావు, బంటు గోవింద, యర్రంశెట్టి గోపి, పండూరి ఈశ్వరరావు ఒక ఫిర్యాదు, ఎం.ఎస్.బాబు మరొక ఫిర్యాదు విడివిడిగా అందించారు.

50 మద్యం సీసాలు స్వాధీనం

ఒకరి అరెస్టు

రావికమతం: పెద్ద ఎత్తున మద్యం సీసాలు నిల్వ చేసిన నిందితుడిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ ఉమామహేశ్వర రావు శుక్రవారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తట్టబంద గ్రామానికి చెందిన ఖండేలా అప్పారావు ఇంటిపై సిబ్బందితో దాడి చేశామన్నారు. ఈ దాడిలో 50 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.